రైతుల సహకారంతో త్వరగా రీ సర్వే



చిప్పాడలో స్కూల్ నిర్మాణ పనులపై ఆరా తీస్తున్న జేసీ విశ్వనాథన్



శిర్లపాలెంలో సర్వే రికార్డులు పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్

ఆనందపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూ రీ సర్వేకు రైతులు తమ వివరాలు అందజేసి సహకరించాలని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ సూచించారు. మండలంలోని శిర్లపాలెం గ్రామంలో జరుగుతున్న ఎంజాయ్‌మెంట్ భూ సర్వేను ఆయన బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ సర్వే సమయంలో రైతులు తమకున్న ఆధారాలను అధికారులకు అందించాలని సూచించారు. చిన్న చిన్న లోపాలు ఉంటే రైతులు గ్రామంలోనే చర్చించుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. దీని వల్ల సర్వే త్వరితగతిన పూర్తై రైతులకు హక్కు పత్రాలు అందించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే ఆలస్యమైందని... అధికారులు, రైతులు సమన్వయంతో సర్వే పూర్తి చేయాలన్నారు. అన్‌సెటిల్డ్ విలేజీగా ఉన్న శిర్లపాలెంలో సుమారు 260 ఎకరాల భూమి ఉండగా, 120 ఎకరాలు ఇనాం, 140 ఎకరాలు దేవాదాయ, మాన్యాస్, ప్రభుత్వ భూములుగా నమోదై ఉన్నాయన్నారు. ఈ మేరకు 120 ఎకరాల ఇనాం భూమిని సెటిల్ చేసి రైతులకు పూర్తి హక్కులతో పట్టాలు అందజేయనున్నామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, డీటీ రాజేష్, ఆర్ఐ మణికంఠ, వీఆర్వో రామారావు తదితరులు పాల్గొన్నారు.

చిప్పాడలో 'నాడు – నేడు' పనుల పరిశీలన

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడలో 'నాడు – నేడు' పథకం కింద చేపడుతున్న జెడ్పీ హైస్కూల్ నిర్మాణ పనులను జేసీ విశ్వనాథన్ బుధవారం బుధవారం పరిశీలించారు. సర్వే నంబర్ 77, 78లోని 1.20 ఎకరాల్లో రూ.44.98 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన ప్రహరీని, హద్దులను పరిశీలించారు. అనంతరం రూ.77.99 లక్షలతో నిర్మించాల్సిన అదనపు తరగతి గదులను, రూ.62.94 లక్షలతో కల్పించనున్న వసతుల వివరాలు అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. ఆయనవెంట భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డి, తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ ఉన్నారు. 'నాడు – నేడు' పనుల ప్రగతిని ప్రధానోపాధ్యాయుడు రేక అప్పారావు, ఉపాధ్యాయులు ప్రసాదరావు, రమేష్ తెలియజేశారు.

➤ ఆన్‌లైన్ పంట నమోదులో భాగంగా మజ్జివలస రెవెన్యూ పరిధి లక్ష్మీపురం పంచాయతీలో పంటలను జేసీ విశ్వనాథన్ బుధవారం పరిశీలించారు. సచివాలయం, రైతుభరోసా కేంద్రం సిబ్బంది రైతుల ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్న మిరప పంటను విజయరాంపురం గ్రామంలో పరిశీలించి సరిచూసుకున్నారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు.

న్యాయం చేయాలని కొంకువీధి వాసుల ఆందోళన



తమ వద్ద ఉన్న పత్రాలు చూపుతున్న కొంకివీధి వాసులు

భీమునిపట్నం: ఇళ్ల విషయంలో తమకు న్యాయం చేయాలని భీమిలి చిన్నబజారు సమీపంలోని కొంకువీధి వాసులు బుధవారం వారి నివాసాల వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని సర్వే నంబర్ 60లో గత వంద సంవత్సరాల నుంచి సుమారు 70పైనే కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నామన్నారు. విజయనగరం రాజులకు సంబంధించిన ఈ స్థలంలో అప్పట్లోనే తాము నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉండడానికి అనుమతి ఇచ్చారని తెలిపారు. దాని ప్రకారం శాశ్వత నివాసాలు నిర్మించుకుని, పన్నులు చెల్లిస్తున్నామన్నారు. అయితే ఇటీవల కొందరు ఆ స్థలం కొనుగోలు చేశామని, వెంటనే ఖాళీ చేయాలని బెదిరించి, దౌర్జన్యాలకు పాల్పడుతున్నట్టు తెలిపారు. తమను రోడ్డుపై పడేసి ఇళ్లను కూల్చివేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. వృద్ధులు, చిన్నపిల్లలతో నివసిస్తున్న తామంతా భయాందోళనకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశామని, వారు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

నిర్లక్ష్యంపై జీవీఎంసీ కమిషనర్ ఆగ్రహం

- ప్రజా మరుగుదొడ్లు వినియోగంలో లేకపోవడంపై మండిపాటు
- తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని రాజాబాబు ఆదేశం



బంగ్లామెట్టలో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, ఇతర అధికారులు

తగరపువలస: భీమిలి బీచ్‌లో ప్రజా మరుగుదొడ్లు వినియోగంలోకి తీసుకురావాలని రెండు నెలలుగా చెబుతున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ సహాయ ఇంజినీర్ సుమన్‌పై జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు సంబంధిత అధికారులతో కలిసి భీమిలి, తగరపువలస ప్రాంతాల్లో బుధవారం ఉదయం పర్యటించారు. నోవాటెల్ ఎదురుగా బీచ్‌లో వ్యర్థాలు లేకుండా శుభ్రం చేసి డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సాగర్‌నగర్ కూడలి, బీచ్‌ను శుభ్రం చేయాలని అక్కడి అధికారులను ఆదేశించారు.

బంగ్లామెట్ట వాసులకు తాగునీరివ్వండి

ఈ సందర్భంగా జీవీఎంసీ ఒకటో వార్డు సంగివలస, బంగ్లామెట్ట ప్రాంతాల్లో రాజాబాబు పర్యటించారు. తాగునీటి సమస్యను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే వారికి సమృద్ధిగా తాగునీరు అందించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. బంగ్లామెట్ట, శ్రీనగర్ కాలనీల నుంచి మురుగునీరు బయటకు వెళ్లే అవకాశం లేనందున ప్రైవేట్ స్థల యజమానులతో మాట్లాడి ప్రధాన రహదారికి అనుసంధానంగా ఉన్న డ్రైనేజీకి మళ్లించాలని సూచించారు. బంగ్లామెట్ట శ్మశానవాటికను ఆధునికీకరించి తాగునీరు, షెల్టర్, విద్యుత్, కాపలాదారుడు, లాకర్ తదితర వసతులు కల్పించాలని ఆదేశాలిచ్చారు.

సంగివలస చెరువు వద్ద సర్వీస్ రోడ్డుపై మురుగునీరు రోజుల తరబడి నిలిచిపోతోందని స్థానికులు ఆయనకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన చెరువు అవుట్‌లెట్ సమస్యను గుర్తించి భీమిలి ఆర్డీవోతో మాట్లాడి తక్షణమే పరిష్కరించాలని కార్యనిర్వాహక ఇంజినీరును ఆదేశించారు. ఆయనవెంట జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి కె.ఎస్.ఎల్.జి.శాస్త్రి, జెడ్సీ బి.రాము, పర్యవేక్షక ఇంజినీరు శ్యామ్‌సన్ రాజు, కార్యనిర్వాహక ఇంజినీరు మత్స్యరాజు, ఏసీపీ శ్రీనివాసరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

డే అండ్ నైట్ వాలీబాల్ పోటీలకు ఆహ్వానం

తగరపువలస: మహా శివరాత్రి సందర్భంగా చిట్టివలస బంతాట మైదానంలో ఈ నెల 18న జిల్లా స్థాయి డే అండ్ నైట్ వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్టు చిట్టివలస, భీమిలి వాలీబాల్ అసోసియేషన్ కన్వీనర్ బోర శ్రీనివా సరెడ్డి తెలిపారు. నాకౌట్, లీగ్ పద్ధతిలో నిర్వహించే పోటీల్లో గెలుపొందిన జట్లకు వరుసగా రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.2 వేలు నగదు బహుమతులు ఇవ్వనున్నా రు. ఆసక్తి కలిగిన వారు వివరాలకు 83410 99666, 94943 25002 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తప్పిన పెను ప్రమాదం



మినీ లారీని ఢీకొన్న కారు

కొమ్మాది: బీచ్‌రోడ్డులో సాగర్‌నగర్ వద్ద రోడ్డు మార్గ మధ్యలో గల డివైడర్‌పై ఉన్న మొక్కలను ట్రిమ్మింగ్ చేస్తున్న మినీ లారీని కారు ఢీ కొట్టింది. వివరాల్లోకి వెళ్తే... సాగర్‌నగర్ రాడిసన్ బ్లూ ఎదురుగా బుధవారం ఉదయం చెట్ల ను ట్రిమ్మింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డు పై ఉన్న మినీ లారీని వైజాగ్ నుంచి కారులో వస్తున్న నవీన్ అనే యువకుడు వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ క్రమంలో కారులో ఉన్న బెలూన్స్ ఓపెన్ కావడంతో ఎవరికీ ప్రమాదం జరుగలేదు. కారు ముందు భాగం నుజ్జయిపోగా లారీ వెనుక భాగం పాక్షికంగా దెబ్బతిన్నట్లు నిర్వాహకులు తెలిపారు.

టార్గెట్‌బాల్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న గీతం అధ్యక్షుడు శ్రీ భరత్

కొమ్మాది: భారతీయ క్రీడగా ఇటీవల కాలంలో అభివృద్ధి చెందిన టార్గెట్ బాల్‌లో యువకులు రాణించి అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగాలని గీతం అధ్యక్షుడు ఎమ్.శ్రీ భరత్ సూచించారు. అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో గీతం వేదికగా మూడు రోజులపాటు నిర్వహించనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల టార్గెట్ బాల్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. టార్గెట్ బాల్ వంటి నూతన క్రీడల ద్వారా త్వరితంగా జాతీయ, అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సోనూ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు



బంగ్లామెట్ట పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

తగరపువలస: విచ్చలవిడిగా పెరుగుతున్న ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు పర్యావరణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో కేంద్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏడాది క్రితం సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించిందని బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజు అన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కలిగించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు రమేష్, మల్లిక, నాగమణి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వృద్ధునికి గాయాలు

తగరపువలస: భీమిలి మండలం గొల్లల తాళ్లవలస వద్ద ఈ నెల 7న సాయంత్రం సర్వీస్ రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొని కోరాడ సూరిబాబు అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. తగరపువలస నుంచి ఆనందపురం వైపు వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ముఖం, కాలు, చేతిపై తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని సంగివలస అనిల్ ఎన్ఆర్ఐ జనరల్ ఆస్పత్రికి తరలించారు. భీమిలి ఏఎస్ఐ రామం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ కాలనీలో యూజీడీ క్లీనింగ్ పనులు



మ్యాన్‌హోల్ శుభ్రం చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

మధురవాడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి అధికార యంత్రాంగం తక్షణమే చర్యలు చేపడుతున్నారు. జీవీఎంసీ 5వ వార్డు జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ కొమ్మాది వైఎస్సార్ కాలనీలో మంగళవారం సాయంత్రం 72వ నంబరు సచివాలయం పరిధిలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గడప గడపకూ వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీలోని 29 నుంచి 38 వరకు గల బ్లాకుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోల్స్, పైప్ లైన్స్ పూడుకుపోయి మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్న దృశ్యాన్ని గమనించారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్టు, సమస్య పరిష్కరించాలని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. తక్షణమే చర్యలు చేపట్టాలని జెడ్సీ కనక మహాలక్ష్మిని ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. ఈ నేపథ్యంలో యూజీడీ సిబ్బంది మ్యాన్ హోల్స్ శుభ్రం చేసే పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. అయితే ఇందులో చెత్త కంటే గుడ్డలు, శానిటరీ నాప్‌కిన్స్ వంటివి ఎక్కువగా వుడడంతో పూడికపోయినట్లు గుర్తించారు. పనులను వైఎస్సార్ సీపీ నాయకులు పర్యవేక్షించారు.

ఒడిశా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభం



భోజనం వడ్డిస్తున్న ఎంపీపీ రాంబాబు తదితరులు

పద్మనాభం: స్థానిక ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న ఒడిశా కార్మికుల పిల్లల కోసం మద్ది గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రత్యామ్నాయ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపీపీ కంటుబోతు రాంబాబు బుధవారం ప్రారంభించారు. అక్షయ పాత్ర ద్వారా పిల్లలకు భోజనాలు సమకూర్చారు. డీఈవో ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ బి.శ్రీనివాసరావు సూచనల మేరకు భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.శివరాణి, సమగ్ర శిక్షా అభియాన్ ప్రత్యామ్నాయ పాఠశాల కో–ఆర్డినేటర్ శైలజ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: అర్హులందరికీ నిష్పక్షపాతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డు 61వ నంబరు సచివాలయం పరిధిలో గల పోర్టుకాలనీ, శ్రీనివాసనగర్, కృష్ణానగర్, భరత్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, ప్రభుత్వం ద్వారా జరిగిన మేలు వివరిస్తూ కరపత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వం లక్షా 80 వేల కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తోందన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. భీమిలి నియోజకవర్గంలో వెయ్యి కోట్ల రూపాయలు అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం ఖర్చు చేసినట్టు తెలిపారు. భరత్‌నగర్‌లో బీటీ రోడ్డు, వీధిలైట్లు, పార్కు అభివృద్ధి చేయాలని, కృష్ణానగర్‌లో ద్రోణంరాజు కల్యాణ మండపం వద్ద డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, కాంపౌండ్ వాల్ మరమ్మతులు చేపట్టాలని కోరారు. అలాగే నిర్మానుష్య ప్రదేశాల్లో మందుబాబులు, ఆకతాయిలు వీధిలైట్లు ధ్వంసం చేస్తున్నారని, రాత్రివేళల్లో పోలీసు గస్తీ పెంచాలని కోరారు. పందులు, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. సమస్యల పరిష్కారానికి చర్య లు చేపడతామని ఎమ్మెల్యే శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, మాజీ సర్పంచ్ కుడితి రామారావు, చేకూరి రజని, బంగారు ప్రకాశ్, పెంద్ర అప్పన్న, జగ్గుపిళ్ల నరేష్, భాగం స్వాతి సుధాకర్, జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి, టీపీబీవో హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు స్వచ్ఛందంగా భూములివ్వాలి

పద్మనాభం: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణానికి భూములు ఇవ్వడానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఇన్‌చార్జి తహసీల్దార్ వేణుగోపాలరావు కోరారు. మండలంలోని నేరెళ్లవలస పంచాయతీ కొయ్యపేటలో బుధవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణానికి భూముల సేకరణపై రైతుల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ బలవంతంగా రైతుల నుంచి భూములు తీసుకోమన్నారు. స్వచ్ఛందంగా ఇస్తేనే తీసుకుంటామన్నారు. డీ పట్టా భూమి ఇచ్చిన వారికి ఎకరాకు 900 గజాలు, ఆక్రమణలో ఉన్న భూమికి ఎకరాకు 450 గజాలు ప్రభుత్వ పరంగా ఇస్తామన్నారు. అయితే ఇళ్ల నిర్మాణానికి తమ భూములు ఇవ్వడానికి పలువురు రైతులు నిరాకరించారు. రెండు రోజుల్లోగా అభిప్రాయాలు తెలపాలని తహసీల్దార్ వారికి సూచించారు. మరోవైపు బలవంతంగా భూముల సేకరణ ఆపాలని పలువురు రైతులు సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

జగనన్న ఇళ్లు త్వరగా పూర్తి చేయాలి

- జాయింట్ కలెక్టర్ విశనాథన్



ఇళ్ల నిర్మాణంపై సచివాయ సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

పద్మనాభం: జగనన్న కాలనీ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ విశనాథన్ ఆదేశించారు. మండలంలోని కృష్ణాపురంలో వేసిన కృష్ణాపురం, పద్మనాభం జగనన్న కాలనీ ఇళ్ల లే అవుట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విశ్వనాథన్ మాట్లాడుతూ ఈ లే అవుట్లలో 463 మందికి ఇళ్లు మంజూరు చేశామన్నారు. వీటిలో మిగిలిన ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని, బేస్‌మెంట్ లెవెల్లో ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించుకోవాలని గృహ నిర్మాణ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం నర్సాపురం గ్రామంలోని జగనన్న పట్టణ గృహ లే అవుట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ఈఈ సత్యనారాయణ, పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న బాలుడు అరెస్ట్

పద్మనాభం: మండలంలోని పొట్నూరులో ప్రేమ పేరుతో బాలికను వేధించి కిడ్నాప్ చేసిన బాలుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఎస్ఐ భరత్ కుమార్‌రాజు తెలిపారు. ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. పొట్నూరు గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలిక విజయనగరంలోని ఓ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలుడు ఏడాది నుంచి ప్రేమ పేరుతో ఆ బాలికను వేధిస్తున్నాడు. మంగళవారం రాత్రి పొట్నూరులో తన ఇంటి వద్ద చదువుతున్న బాలికను బాలుడు కిడ్నాప్ చేసి విశాఖపట్నం తీసుకెళ్లిపోయాడు. దీనిపై బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. బాలుడిని విశాఖపట్నంలోని జువైనల్ హోమ్‌కు తరలిస్తామని తెలిపారు.

డ్రైనేజీలపై ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

- చోద్యం చూస్తున్న జీవీఎంసీ టౌన్ ప్లానింగ్, సచివాలయ సిబ్బంది



సంతపేట గొల్లవీధిలో స్థానికులు పూర్తిగా మూసివేసిన డ్రైనేజీ



ఇంటి నిర్మాణం లేనిచోట శిథిలమై కనిపిస్తున్న పంచాయతీ కాలం నాటి డ్రైనేజీ

తగరపువలస: భీమిలి జోన్ పరిధిలో ఇష్టారాజ్యంగా డ్రైనేజీలపై నిర్మాణాలు చేపడుతుండటం పారిశుధ్య సిబ్బందికి సంకటంగా మారింది. ఎక్కడైనా గృహ నిర్మాణ యజమానులు రోడ్లపై మెటీరియల్ వేస్తే జరిమానాలతో భయపెట్టే టౌన్ ప్లానింగ్ విభాగం, సచివాలయ సిబ్బంది... వారి కళ్ల ముందే డ్రైనేజీలు ఆక్రమణలకు గురయి వుతున్నా పట్టించుకోవడం లేదు. దీంతో జీవీఎంసీ రెండో వార్డు గొల్లవీధిలో చిల్డ్రన్స్ పార్కు నుంచి భీమిలి రోడ్డు వరకు ఇరువైపులా డ్రైనేజీలు పూర్తిగా మాయమైపోయాయి. ఇళ్ల నిర్మాణం ఉన్నచోట్ల డ్రైనేజీల జాడే లేకుండా పోగా, ఖాళీ ప్రదేశాల వద్ద డ్రైనేజీలు శిథిలమై కనిపిస్తున్నాయి. మొత్తం డ్రైనేజీలు మట్టి, పాలిథిన్‌తో పూడుకుపోయి కనిపిస్తున్నాయి. పారతో చెత్త తొలగించాలన్నా ఎక్కడా అవకాశం కనిపించడం లేదని పారిశుధ్య సిబ్బంది వాపోతున్నారు. దీంతో వర్షాలు కురిసే సమయంలో సత్యనారాయణకొండ ఎగువ నుంచి ప్రవహించే వర్షం నీరు డ్రైనేజీల్లో నుంచి వెళ్లకుండా రోడ్డుపై నిలిచిపోతుంది. గత ప్రభుత్వ హయాంలో సంతపేట గొల్లవీధి మార్గంలో అరకొరగా నిర్మించిన డ్రైనేజీలపై మొత్తం ఆక్రమణలు వెలిశాయి. డ్రైనేజీ పునర్నిర్మాణం జరగని చోట 40 ఏళ్ల క్రితం పంచాయతీల కాలం నాటి రాతికట్టు శిథిలమై రాళ్లు తేలిపోతూ కనిపిస్తున్నాయి. సంతపేట గొల్లవీధిలో భీమిలి రోడ్డు వరకు ఇరువైపులా డ్రైనేజీలపై నిర్మాణాలు తొలగించి పారిశుధ్య సిబ్బంది చెత్త, పూడిక తొలగించడానికి, వర్షం నీటి ప్రవాహానికి అనువుగా ఆధునికీకరించాలని స్థానికులు కోరుతున్నారు.

హిందీ పరీక్షా కేంద్రం పరిశీలన



నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో ఆరిలోవ హిందీ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ గణపతిరావు తదితరులు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై ఆధ్వర్యంలో ఈ నెల 11, 12న భీమిలిలోని నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ కేంద్రంగా లోయర్, హిందీ పరీక్షలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆరిలోవ హిందీ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ పి.గణపతిరావు, విశాఖ సర్కిల్ రీజినల్ కేంద్రం మేనేజర్ ఎ.నెక్కిరామ్ నాయక్ ఈ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాలు, నామినల్ రోల్స్‌ను ప్రధానోపాధ్యాయురాలు మాదాబత్తుల తిరుమల శ్రీదేవికి అందించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.